


జైలులో ఉన్న నేరస్థులకంటే జైలు బయట ఉంటున్న నేరస్థులు వ్యవస్థని కలుషితం చేస్తూ దేశాన్నెక్కువ దోచుకుంటున్నారన్న సత్యాన్ని బహిర్గతం చేసిన యీ కధలో సామాజిక స్పృహ, సందేశమూ పుష్కలంగానే వున్నాయి.

....కధకి అతి ముఖ్యమైన–చదివించే గుణం వుంది. అంతేకాదు. మున్ముందు యీ రచయిత నుంచి ఇంకా మంచి కధలు రావొచ్చుననే ఆశా భావమూ కలిగిస్తుంది.

—ఇచ్ఛాపురపు రామచంద్రం.

చిక్కని చీకటి లోకాన్నావరించుకుందా రాత్రి. జనసంచారం లేని ఆ నేషనల్ హైవేమీద నిశాచరిలా ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు పరుగెత్తుతు పోతూంది.

సమయం పన్నెండు గంటల రెండు నిముషాలు.

అనుకోని సంఘటనకు సడెన్ బ్రేక్‌తో ఆగింది బస్సు. ఎదురుగా ఎర్రలాంతరు వూగుతోంది. ఆ లాంతర్ ప్రక్కన రెండు మూడు మోటర్ సైకిళ్ళు ఆగివున్నాయి.

బస్సు ఆగిందే తడవుగా నలుగురు వ్యక్తులు బూట్లు టక టక లాడించుకుంటూ రెండు ద్వారాలగుండా లోపలికి ప్రవేశించారు.

"ఎవ్వరూ కదలకండి. కదిలారో ప్రాణాలుండవ్ జాగ్రత్త!" అరిచిందో కంఠం; చేతిలోని పిస్తోలును బస్సుడ్రైవర్ వైపు గురి పెడుతూ.

అందరితోపాటు డ్రైవరూ కండక్టరూ కూడా నిస్సహాయంగా చూస్తూ వుండిపోయారు. మగత నిద్రలోవుండి బస్సుకుదుపుకు వులిక్కి పడిలేచిన కొందరు ప్రయాణీకులు ఈ హఠాత్పరిణామానికి .... భయ భ్రాంతులై చూస్తున్నారు వారి వంక.

వాళ్ళ చేతుల్లో పిస్తోళ్ళున్నాయి. ముఖాలకి ముసుగులున్నాయి.

"టిక్కెట్ల సొమ్ముగాక అన్యాయంగా వసూలుచేసిన డబ్బెంత వుందో బయటకు తియ్" కండక్టర్ని గద్దించాడొక వ్యక్తి.

"ఇదంతా టిక్కెట్లమ్మిన సొమ్మే అంతా గవర్నమెంటుది. నాదొక్క పైసాకూడా లేదు" వణుకుతూనే చెప్పాడు కండక్టరు.

"నో....మాకు తెల్సు. లెక్కలోకిరాని చాలా సొమ్మంటుం దిందులో. టిక్కెట్లివ్వకుండా వసూలుచేసిందీ; లగేజిలోపంలో పిండినదీ... న్యాయంగా తియ్యకపోయావో మొత్తానికే మునిగిపోగలవ్ జాగ్రత్త."

కండక్టర్ లెక్కజూసి, కొంత డబ్బు అతని సంచిలో వేశాడు.

"సో. యువారె గుడ్‌బాయ్" అంటూ ముందుకు కదిలేడావ్యక్తి. అతని దృష్టి రెండో వరుసలో కూర్చున్న దంపతులపై పడింది. అతనికి యాభై ఏళ్ళుంటాయి. ఎర్రగా గుండ్రాయిలా వున్నాడు. ఖరీదైన బట్టలు వేసుకున్నాడు చేతిలో నున్న బ్రీఫ్ కేసును వీపువెనుక దాచాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాడు.

"ఏముందందులో?" సౌమ్యంగానే వుంది ప్రశ్న.

"ఏముంటాయ్ బట్టలు.... వూరెళ్తున్నాం" ధైర్యంగానే చెప్పాడతడు.

"బట్టలేనా? పాతన్యూస్ పేపర్లూ చెల్లని బేఠకాసులూకూడా వున్నాయా?" ఆ గొంతులో వ్యంగ్యం ధ్వనించింది.

కోపంతో గుడ్లురిమి చూసి మౌనంగానే వూరుకున్నాడతడు.

ఒక్కడుగు ముందుకువేసి, అతని చేతుల్లోని బ్రీఫ్ కేసును లాక్కొని తెరిచాడు.

రెండు పుస్తకాలూ, ఒకడైరీ ...కొన్ని నోట్లకట్టలూ.

బస్సులో అందరి దృష్టీ అటువైపేవుంది.

బట్టతలాయన నిస్సహాయంగా గుడ్లు తేలవేశాడు. భయంతో వణుకుతున్నాడు.

"ఇప్పుడు చెప్పు. యివి బట్టలుకదూ"

"మా అబ్బాయి ...పట్నంలో డాక్టర్ చదువుతున్నాడు.... స్కూలు ఫీజూ హాస్టల్ ఫీజూ....కట్టాలని...." నెమ్మదిగా గొణిగాడు.

"నిజం చెప్పకపోతే అర్ధరాత్రి నడిరోడ్డుపై దించెయ్యాల్సి వుంటుంది. ఈ రోజుల్లో చదువు ఖర్చుతో కూడినదే. మాకూ తెల్సు. కానీ యిన్ని వేలు...."అని, నోట్ల కట్టల్ని చేతిలోకి తీసుకున్నాడు.

ముసలాయన దృష్టి రెపరెపలాడే నోట్లమీదేవుంది. ఏం చెప్ప టానికి నోరుపెగలటంలేదు.

"చెప్పెయ్యండీ. ఏం? పీకతీసిమెయిలేస్తాడా" అతనిభార్యఅంటోంది. ఏం చెబితే ఏమవుతుందోనని అతని భయం!

"అబ్బాయికి పెళ్ళిచెయాలనుకుంటున్నాం. ఇది కట్నం సొమ్ము. ఇందులోనే వాడి చదువుకి చేసిన అప్పుతీరాలి. వాడికి ఉద్యోగం వచ్చే వరకూ యిల్లు గడవాలి" అన్నాడు ధైర్యం తెచ్చుకుని.

"అలారండి దారికి. డాక్టర్ని చదివించి మీ అబ్బాయిని అమ్మగా వచ్చిన సొమ్మన్నమాట. ఫర్వాలేదు" అంటూ నాలుగు కట్టల్లోని రెండిం టిని తన సంచిలో వేసుకున్నాడు.

"బాబ్బాబూ.... అది...." బతిమాలబోయాడు ముసలాయన.

"మరేం మాట్లాడకండి. ఇంకా చదువు పూర్తికాక ముందే అబ్బాయికి పెళ్ళి చెయ్యాలనుకోడం మొదటితప్పు. పెళ్ళిచేస్తూ యింత భారీమొత్తాన్ని కట్నంగా పుచ్చుకోడం రెండోతప్పు. ఆరెండు తప్పులకూ పూర్తిమొత్తం తీసేసుకోవచ్చు. కానీ చదువింకా పూర్తి కాలేదంటున్నారు కాబట్టి సగమే తీసుకున్నాను. రేపు మీ వాడికి డిగ్రీవస్తే స్టెత్ వుపయో గించకుండా కనీసం రోగివంక చూడకుండానే మందులురాసిచ్చేపాతికలూ, యాభైలూ పిండి, యేడాదిలో మీ అప్పులమొత్తాన్ని తీర్చేస్తాడు. ఓ.కే!" అంటూ ముందుకు కదిలాడు.

బస్సులోని అందరూ అతని వంక భయం భయంగా చూస్తు న్నారు.

అతని చూపులు ఆ ముందుసీట్లో కిటికీ ప్రక్కన కూర్చున్న యువతిపై పడ్డాయి.

ఆమె గుండెలు గుభేల్మన్నాయి. తన దగ్గర డబ్బేంలేదు. వచ్చే టప్పుడు ప్రావిడెంట్ ఫండ్‌లోంచి తీసిన వెయ్యిరూపాయల మొత్తమూ

తండ్రికేయిచ్చి వస్తోంది. మహానగరంలో తనొంటిగానే వుద్యోగం చేసుకుంటూ గడుపుతూన్నా ఎప్పుడూ యిటువంటి విపత్కర పరిస్థితిలో చిక్కుకోలేదు. చటుక్కున ఆమెకు తనఒంటిపైనున్న వస్తువులు గుర్తొచ్చాయి. మెళ్ళోని వంటిపేటగొలుసూ, లాకెట్టూ; చేతికున్న రెండుజతల గాజులూ కలిపి రెండున్నర తులాలుంటాయి. ఎలాలేదన్నా అయిదువేలు. అది చాలదూ తనవంటి బీదఇంటి పిల్లకి? ఉద్యోగంలో చేరాక వచ్చిన మూడు సంవత్సరముల బోనసు డబ్బులతోనూ, సేవింగ్స్‌తోనూ చేయించుకున్నవవి. ఆ దుండగులు అలా వదుల్తారా? అంతకంటె ... అంతకంటె ... డబ్బుకంటె ఎక్కువయిన మానాన్ని ....యిక ఆలోచించలేకపోయిందామె. ఆమె శరీరం భయంతో వణకడం మొదలుపెట్టింది.

ఏమో! ఎవరు చెప్పగలరు? తెల్లారిలేస్తే 'యువతి మానిభంగం' అనే వార్త లేని పేపరుందా? అందర్నీ తలో విధంగా దోచి, తననిలా దోచేస్తే....?ఆమె కళ్ళు మూసుకుని మనసులోనే భగవంతుడికి దండాలు పెట్టుకుంది.

ముందుకు కదిలాడతడు.

కదిలి, ఖద్దరు లాల్చీ ప్రక్కన ఆగేడు.

"మీరెందాకా వెళుతున్నారు మాష్టారు?"

"హైద్రాబాదు" కాస్త ధైర్యంగానే జవాబు చెప్పింది ఖద్దరు లాల్చీ.

"వెరీనైస్ - ఆ ఖద్దరు సంచీ ఇలా ఇవ్వండి"

"ఎందుకూ? ఇందులో ఏం లేవు"

"అందుకే ఇమ్మంటున్నది ఇలా ఇవ్వండి"

"ఏంటయ్యా దౌర్జన్యం? ఇలా దారి కాసి దోచుకోకపోతే సుబ్బరంగా పన్లు చేసుకు బతకరాదూ?"

"ఓ! చేసుకోవచ్చు. అందుకే యీ ప్రయత్నం"అని అతని చేతిలోని సంచీలాగి చూశాడు.

ఖద్దరు సంచిలో పొట్టవుబ్బిన లెదర్ జిప్ బాగ్.

"చాలా బావుంది. పైన స్వదేశీయంలోని విదేశీయం అందులోనిది లక్ష్మీదేవేనా?"

జిప్‌లాగి చూశాడు. వందరూపాయల కట్టలు—కొత్తనోట్లకట్టలు!

"ఇది ప్రజల డబ్బేకదు నాయకోత్తమా?"

గుడ్లురిమి చూసింది ఖద్దరులాల్చి.

"కాదు-అది పార్టీసొమ్ము. పైసా తగ్గిందా రేపు కటకటాలవెనక వుంటావు జాగ్రత్త!"

"కాదుమరీ! పార్టీ సొమ్ముతింటే కటకటాలే గతి. ప్రజల సొమ్ము మాత్రం హాయిగా మింగెయ్యవచ్చు. జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం."

"హద్దుమీరి ప్రవర్తించక ముందు దబ్బందులో పెట్టేయ్!"

హెచ్చరిక, బెదిరింపు... ఆ కంఠంలో.

ఆ డబ్బును తన బ్రీఫ్‌లో పెట్టేసుకుని ఖాళీ జిప్‌బేగ్‌ని ఇద్దరు సంచిలోకితోసి, అతని కండించాడు.

"ఇలా దోచుకోకుండా పని చేసుకుని కదూ బ్రతకమన్నారూ. మాలో చాలామందికి డిగ్రీలున్నాయి. మీరు రాజధాని వెళ్ళి మీ ప్రయత్నంలో మాకు పనులిచ్చే ఏర్పాటు చేస్తే తప్పక మనేస్తాం. అంత వరకూ మీ పార్టీసొమ్ము ఖర్చు పెడుతుంటాము. ప్రజాక్షేమంకోసం కాక పోతే పార్టీకీ, పార్టీసొమ్ముకి పరమార్థ మేముంటుంది?" అంటూ ముందుకు అడుగేశాడు.

కాస్తో కూస్తో డబ్బు తమ దగ్గరున్న వాళ్ళందరూ అతని తీరును చూసి భయపడుతున్నారు.

అతని దృష్టి ఆమెపై పడింది. వయసు నలభై ఏళ్ళపైనే వుంటాయామెకు. దబ్బపండురంగు శరీరం. దబ్బపండులానే గుండ్రటి చిన్న బుర్రా మెళ్ళో మాత్రం ఆరేడు పేటల చంద్రహారం, కాసుల పేర్లో

ఏవో.. ఎప్పటివో పేర్లు కూడ తెలీని నగలు. చేతులకు అరడజనేసి బంగారు గాజులూ.

అవీ అతని నాకర్షించాయి.

"ఎక్కడికి" గదమాయించాడు.

"పట్నమెళ్తన్నా. ఏం?"

"పట్నంలో ఎవరుంటారూ? ఏంపనీ"

"ఏటా ప్రశ్న. వంద పన్లుంటాయ్. నీకేం పనీ"

"ప్రశ్నకు ప్రశ్న జవాబుకాదు. అక్కడేంపనీ అనే అడుగుతున్నా"

"మా యజమానికాడికి, సరా!"

"ఏం చేస్తాడాయన అక్కడ?"

"బియ్యమేపారం" అంది. ఇబ్బందిగా ముఖం పెట్టి.

"అలాగా. తెల్లరాళ్ళా నల్లరాళ్ళా ఇక్కడ్నుంచే తీస్కెళుతుంటావా?"

కోపంగా చూసి తలతిప్పుకుందేగాని సమాధానం చెప్పలేదు.

"బియ్యంలో రాళ్ళు కలిపి రాళ్ళ నెక్లెసులు చేయించుంటాడు నీ యజమాని. ఏదీ రెండు పేటలిలా పడెయ్. ఈ రోజుల్లో బంగారం ఆరోగ్యానికంత మంచిది కాదు!"

"ఆమెచలించలేదు. మౌనంగా తనను కానట్టు వూరుకుంది.

"ఇది చూశావా. ఎన్ని తళుకులో ఈ కత్తికి! దీనికి ఆడ, మగ తేడాలేదు. దానిక్కావల్సింది మొండివాళ్ళ రక్తం. అంచేత .... ఏదీ .... అవిలాపడెయ్!"

బస్సులో ఎంతమందివున్నా ఎవరూ కిక్కురుమనలేదు.

ఆ వాతావరణం అటువంటిది. అందరికీ ప్రాణాలమీద తీపే. ఆశే! ఎదిరించడానికి ఎవరిదగ్గరా ఆయుధాల్లేవు.

మారుమాట్లాడకుండా రెండు పేటల గొలుసు అతని చేతికందించిందామె.

ముందుకు కదిలి, మరెవరూ లేరని నిర్ధారించుకున్నాక బస్సంతా మరోమారు కలయజూశాడతను.

ముందు సింగిల్ సీట్లో ఒక కాలేజీ స్టూడెంటు స్టయిల్‌గా సిగిరెట్ కాలుస్తున్నాడు. అతని దగ్గరగా వెళ్ళి.

"సీదే బ్రాండ్ బ్రదర్" అన్నాడు వినయంగా.

"గోల్డ్‌ఫ్లేక్" అంటూ పెట్టి చూపించాడతను.

"దాన్ని చేతిలోకి తీసుకుని "ఎంచదూతున్నావ్" అడిగాడు.

"ఇంటర్. సెకండియర్" కళ్ళెగరేశాడా కుర్రాడు.

"ఐసీ - చదువుకుతగ్గ అలవాటే. చూడమ్మా బస్సుల్లో కాల్చకూడదు. బోర్డు చూళ్ళేదా" అని, పెట్టెను బయటకు గిరవాటేసి క్రిందికి దిగిపోయాడు.

ఆ వెంటనే అతని అనుచరులూ దిగిపోయారు.

బస్సులోని మిగతావారి మనస్సు ఒక్కమారు తేలికపడింది.

డబ్బుపోతే పోయింది. ప్రాణాలు దక్కాయి అంతే చాలునని తృప్తిపడ్డారు డబ్బు పోగొట్టుకున్నవారు.

ఐతే....ప్రయాణీకుల్లో చాలమంది అనుకున్నది ఒకటేమాట. "డబ్బున్న వాళ్ళే దోచుకోబడ్డారు" అని మధ్య తరగతి వాళ్ళని, అంతకంటె అట్టడుగు వాళ్ళనీ వాళ్ళేం చేయలేదు.

"ఇది రాజకీయమైనదోపిడీ" అన్నారు కొందరు.

"దోపిడిదార్లకు మాత్రం జాలిగుండె వుండదా" అన్నారు మరికొందరు.

బస్సు కదిలింది.

అంతే! దుండగుల మోటర్ సైకిళ్ళు వెనుదిరగలేదు.

ఎదురుగా పోలీస్ వాన్!

తప్పించుకోడానికి వీల్లేని పరిస్థితి.

లొంగిపోవడం, దోపిడీ చేసినవి పోలీసుల కప్పగించడం తప్ప లేదు వారికి.

అప్పటికి రాత్రి పన్నెండూ ఇరవై.

* * *

అర్ధరాత్రి పన్నెండూ నలభై.

ఫోను మ్రోగుతూంటే బెడ్‌మీంచి చటుక్కున లేచి, రిసీవర్ని చేతిలోకి తీసుకున్నాడు భుజంగరావు. అంతావిని,

"వేరీనైస్. ఇటువంటి కేసుల్ని పట్టుకుంటేనే మన పోలీస్‌శాఖ పరువు నిలిచేది. బైదిబై గట్టి కాపలా వుంచండి. నేను ఉదయం ఏడింటి కక్కడుంటాను. ఓకే."

ఫోను పెట్టేశాడు భుజంగరావు.

అతని మనసు ఆనందంతో గంతులు వేసింది. ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశింపబడిన ప్రభుత్వశాఖ తమది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం వేళ్ళూని స్థిరపడ్డంతో ప్రజలకు తమ శాఖపై గౌరవంలేకుండా పోయింది.

ఈ దెబ్బతో ప్రజలమెప్పును కొంతపొందే ఛాన్సు దొరికింది. ఏమైనా దీనికి సంబంధించిన తన సిబ్బందికి ఇంక్రిమెంట్లయినా గ్రాంటు చేయించాలి!

సంతృప్తిగా నిట్టూర్చి డన్‌హిల్ సిగిరెట్‌ను రెండు పెదిమలు మధ్యా తగిలించి, లైటర్‌ని వెలిగించేడు భుజంగరావు.

* * *

ఉదయం ఏడు. ఆగుతూన్న జీపులోంచి ఒక్క గెంతు గెంతి, చరచరా మెట్లెక్కి తన గదిలోకొచ్చాడు భుజంగరావు. విషయాన్నంతా

సావధానంగా విని, రాత్రి డ్యూటీలోవున్న స్టాఫ్‌ని అభినందించాడు. దుండగుల ఉదంతాలను తెల్సుకుంటే అతనిలోని భుజంగం బుసలు కొట్టింది.

చాలీచాలని జీతాలతో విసిగిన తమ సిబ్బంది చేతులు చాచవచ్చు. పోలీసూ మనిషే కాబట్టి మనుషుల్లోని బలహీనతలు అతనికి వుంటాయి కాబట్టి కొన్ని తప్పుల్ని చెయ్యవచ్చు, వాటికి తగిన శిక్షలనూ అనుభవించ వచ్చు. కానీ ...అవసరానికి ఎదగాలి. ప్రజల్ని దోచుకుతింటున్న దోపిడీ మూకల్నీ, హంతకుల్నీ మాటువేసి పట్టుకోవాలి. నిర్దాక్షిణ్యంగా శిక్షలు వెయ్యాలి.

ఆర్నెల్లుగా ప్రతినెలా కంప్లయింట్స్ అందుతూనే వున్నాయి. ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా జరగాల్సిన దోపిడీలు జరుగుతూనే వున్నాయి. ఈనాటికి వారి ఆట కట్టయింది.

హేండ్‌స్టిక్ చేతిలోనికి తీసుకుని పగబట్టిన త్రాచులా సెల్‌వైపు నడిచాడు. ఆ క్షణంలో అతనిని చూసి సిబ్బందే భయపడ్డారు. లోపలికెళ్ళి ఒక్కొక్కరినీ తన తీక్షణమైన చూపులతో చూస్తూ నడుస్తున్నాడు భుజంగ రావు.

చటుక్కున అతని కాళ్ళు నడవడం మానేశాయి. అతని కళ్ళలోని క్రౌర్యం ఆశ్చర్యంగా మారింది. అతని చేతిలోని లాఠీ ఎదురైై వూపిరి తీసుకుంది.

అందరిలోనూ చివరివాడు భుజంగరావు ప్రాణ స్నేహితుడి కొడుకు!

భుజంగరావు మనసులో ఒక్కసారి కలవరం చెలరేగింది.

గిరుక్కున వెనుతిరిగి వచ్చేశాడు.

* * *

"తెలివితేటలూ, చదువు, విజ్ఞానం మనిషిని సన్మార్గంలో నడిపించాలి. ఇటువంటి సంఘ విద్రోహక చర్యలకు పాల్పడితే శిక్షేమిటో తెల్సా"

దెబ్బతిన్న పులిలా తలెత్తి చూశాడు చక్రధరం.

భుజంగరావు ముఖం ఎంతో గంభీరంగా వుంది కాస్సేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం.

"మిష్టర్ చక్రీ నేనిప్పుడొక పోలీస్ ఆఫీసర్‌గా అడగటంలేదు. మీ నాన్నగారి ప్రాణస్నేహితుడిగా, ఓ ఆత్మబంధువుగా అడుగుతున్నాను. నిజం చెప్పు. నువ్వెందుకీ దోపిడీ మూకకో చేతులు కలపాల్సి వచ్చింది?"

చక్రధరం ఏం మాట్లాడక పోడం చూసి తిరిగి అతనే అన్నాడు.

"స్వప్రయోజనాల కోసం కొందరూ, రాజకీయ, మత ప్రయోజనాల కోసం మరికొందరూ అమాయకుల్ని పావులుగా వుపయోగించుకుంటున్నారు దిక్కుతోచని స్థితిలో ఎందరో యిలాయిరుక్కొని బలైపోతున్నారు. నిజం చెప్పు. నిన్ని పనికి పురిగొల్పిందెవరు?

"ఇందులో ఎవరి ప్రమేయమూలేదు చట్టరీత్యా మీరు చెయ్యాల్సింది చెయ్యండి" ధైర్యంగానే అన్నాడు చక్రధరం.

ఊహించని ఆ సమాధానికి తీక్షణంగా అతనివంక చూశాడు భుజంగరావు. ఆ వెంటనే శాంతపడి అన్నాడు.

"చూడు చక్రీ నా కర్తవ్యాన్ని నువ్వు గుర్తు చెయ్యనక్కరలేదు. నేనదే చేయాలనుకున్నపుడు మధ్య యీ సంభాషణే అనవసరం. జగన్నాధం నాకెంత కావల్సినవాడో, మా స్నేహ మెటువంటిదో నీకు తెలియక పోవచ్చు మనసుల్లో ఈర్ష్యా ద్వేషాలే తప్ప మమతానుబంధాలూ, స్నేహాలూ వాటి విలువలూ ఎరుగని యీతరం వారికి ప్రతినిధివైన నీకవి అర్ధరహితంగానే అన్పించవచ్చు.

జగన్నాధం ఎంత నిజాయితీపరుడో, మనిషికీ మానవత్వానికి అత

నిచ్చే విలువ లేమిటో నాకు బాగాతెల్సు. ఈ కాకీజట్టల మాటునుంచి,యీ అధికార పరదాల వెనుకనుంచి అపేక్ష, అభిమానాలంటూ నేనీనాడు మాట్లాడుతున్నానంటే దాని కంతటికీ జగన్నాధం స్నేహమే కారణం. అటువంటి ఉన్నతుడికి కొడుకువైన నిన్ను యిలా చూడవలసి రావడం నాకే ఎంతో సిగుగానూ అవమానంగానూవుంది. ఇక అతనికి తెలిస్తే...." భుజంగరావు మాట పూర్తికాకముందే చక్రధరం అందుకున్నాడు.

"నిజమే సిగ్గుగానూ అవమానంగానే వుంటుంది.... నిజాయితీ ఖూనీ అయినప్పుడూ, మంచివాడు అణగద్రొక్కబడి నప్పుడూ"

భుజంగరావు ఆశ్చర్యంగా చూశాడతని వంక.

"అవును. నిజాయితీని నమ్ముకుని, నిప్పులాంటి వాడని పేరు తెచ్చుకున్న నాన్నగారేం బావుకున్నారని? ఆయన నిజాయితీని మంచితనాన్ని ఈలోకం ఏం గుర్తించింది గనుక? ఆదాయపుపన్ను శాఖలో అధికారిగా నిజాయితీతో ఎన్నాళ్ళు కొనసాగేరాయన? ఎక్కడ చూసినా అవినీతే, ఆశ్రితపక్షపాతం పేరుకుపోయిన ఈ వ్యవస్థలో నాన్నగార్ని మంచిగా బతకనిచ్చేరా? అవినీతికి అలవాటుపడ్డ పై అధికారులూ, క్రింది వారూ కలిసి ఆయనపై లేనిపోని అపనిందలువేసి నిర్దాక్షిణ్యంగా ఆయనను తొలగించారు మీ దృష్టిలో నీతికి పట్టం గట్టడమంటే యిదేనా? ఆయనతో పనిచేసే వాళ్ళందరూ మేడలూ, వాహనాలూ కొనుక్కుని హాయిగా వుంటే నిజాయితీని ఆత్మగౌరవాన్నీ నమ్ముకున్న నాన్నగారు తన పిల్లలకే సరియైన తోవ చూపించలేకపోయారు.

బాకీపడ్డ కట్నం సొమ్ముకి పెద్దక్క అన్యాయంగా ఆహుతై పోయింది. వేలకువేలు కట్నం గుమ్మరించే శక్తిలేక పోవడంవల్ల తెలివీ, అందంవున్న చిన్నక్క నూతిలోని కప్పలా వంటిట్లోనే మిగిలిపోయింది. ఆ తర్వాత పిల్లలమైన మాకు చదువులు సాగడమే గగనమై పోయింది.

ఇన్ని బ్రతుకులిలా బండనారి పోపడానికి కారణమేమిటంటారు? యిదేకదూ నిజాయితీ పరుడికి మన వ్యవస్థ చేసే సన్మానం?

ఒక ఉద్యోగం కోసం కాలుమోపిన ప్రతిచోటా మాముందు చాచిన అవినీతి చేతులెన్నెన్నో!

"భవిష్యత్తంతా అంధకారమయంగా తయారైన ఇటువంటి పరిస్థితుల్లో యువతలో ద్వేషం క్రోధంకాక అభిమానం అప్యాయతలెట్లా వుంటాయి సార్!"

భుజంగరావేం మాట్లాడక పోడం చూసి తిరిగి చక్రధరమే అన్నాడు.

"దారికాచి దోచుకున్నవారినే దోపిడీమూక అనుకుంటే. ఇలా ప్రజల్ని దోచేసుకోవానికే నిజాయితీని గద్దెదింపి. అవినీతికి పట్టంగట్టే వారినీ, భావితరాల ఆశల దీపాలైన నేటి యువతలోని తెలివికీ సామర్థ్యానికీ సక్రమమైన దారిమాపక, స్వార్థంతో వారిలో అవినీతి బీజాలునాటి నిలువుదోపిడీ చేసేవారినీ ఏమనాలో మీరే చెప్పండి."

సాటిమనిషిని నిష్కారణంగా చంపేవారినే హంతకులనుకుంటే ధనదాహంతో పెళ్ళి పేరున అబలల ప్రాణాల్ని మింగే వారినేమనాలి? చెప్పండిసార్."

ఇన్ని రకాలుగా అసంతృప్తికి గురయిన నేటి యువత ఎటు పోవాలంటారు?

చట్టాలూ, హక్కులూ, అధికారాలూ, శిక్షలూ మీ చేతుల్లో వున్నాయి. సంఘంయొక్క శాంతి భద్రతల్ని రక్షించే బాధ్యతలూ అవినీతిని రక్షించే హక్కులూ మీకే వున్నాయి.

"మీ దృష్టిలో.... మీ చట్టపరిధిలో మేం చేసినదే తప్పనుకుంటే తప్పకుండా శిక్షించండి. అందుకు మమతాను బంధాలూ స్నేహాలూ అడు

రాకూడదు. మేమేకాక మావంటి దుండగులూ, దోపిడీదారులూ యింకెవ రున్నారో అందర్నీకూడా ఏరివేసి శిక్షించండి"

అంటూ లేచి, ఆవేశంగా వెనుదిరిగి వెళ్ళిపోయాడు చక్రధరం.

అతను వెళ్ళిపోయాక ఒక్క క్షణం తన కుర్చీలో అలానే అచేతనంగా వుండిపోయాడు భుజంగరావు. అతని నుదుటిమీద చమట బిందువులు అధికం కాజొచ్చాయి. ఆలోచనలతో భ్రుకుడిముడి పడింది. కాకీబట్టలలోంచి, అధికారుల వలయాల్లోంచి అతని మనిషిలోని మనిషి ఒక్కమారు యీవలికొచ్చాడు.

నిజమే! తప్పన్నది ఎవరు చేసినా తప్పే. దోపిడీ యే విధంగా యే రీతిలో జరిగినా క్షమించరాని నేరమే. నేరానికి తప్పుకీ శిక్ష పడాల్సిందే!

నీతినిజాయితీలు మనిషిని నిలబెట్టాలి. మానవత్వపు మకుటంలో ఉన్నతంగా పొదగ దగిన విలువైన ఆభరణాలవి.

లేచి నిలబడి, అద్దంలో తనను తాను చూసుకున్నాడు భుజంగరావు.

తన హోదాను చూపే విలువైన టోపీని, తనుచేసిన గొప్ప వీరోచిత కార్యాలకు చిహ్నాలుగా తన చొక్కానలంకరించిన స్టార్ల వంకా మరొక్కమారు చూసుకున్నాడు.

మనో నిశ్చయంతో తన కళ్ళలోకి తనే చూసుకున్నాడు.

ధైర్యంగా అడుగు ముందుకు వేశాడు.

అతని దృష్టి యిపుడు కటకటాల వెనుకనున్న చక్రధరంపైగాని, తదితర దోషులపైగాని లేదు. కటకటాల కివతల నీతి నిజాయితీలనునిరంతరం దోపిడీచేస్తూ యింకా పట్టుబడని దుండగులకోసం గాలించడానికి సమాయత్తమౌతోంది.

(స్వాతి—ఏప్రిల్ 1986)

11)